
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
3



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
గురువారం 4 జూలై 2024

నగలు, నగదు చోరీ

కల్వకుర్తి టౌన్, జూలై 3: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల వెంకటేశ్వర్‌రావు ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. దొంగలు నగలు, నగదు అపహరించారు. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్ రావు ఆదివారం మహబూబ్‌నగర్‌లో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో దొంగలు తాళం పగులగొట్టి, బీరువాలోని రూ.1.20 లక్షల నగదు, మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులను అపహరించారు. వెంకటేశ్వర్ రావు బుధవారం వచ్చి చూసి, దొంగతనం జరిగిందని గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్‌టీం వచ్చి పరిశీలించినట్లు సీఐ నాగార్జున తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

కొంచెం సంతృప్తి అసంతృప్తి

- పదవీ కాలంపై జడ్పీ చైర్‌పర్సన్లు
- నిధులు, విధుల విషయంలో పెదవి విరుపు
- నేటితో ముగియనున్న పదవీ కాలం
- ఐదేళ్లలో పలు జిల్లాల్లో ఎమ్మెల్యేలతో విభేదాలు
- ఇన్‌చార్జీలుగా కలెక్టర్లను నియమించనున్న ప్రభుత్వం



మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

మహబూబ్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్లు, చైర్మన్‌ల పదవీకాలం నేడు గురువారంతో ముగియనుంది. ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీల పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో పాలనకు ఇబ్బంది కలుగకుండా జిల్లా పరిషత్‌కు కలెక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించనుండగా.. మండల పరిషత్‌లకు జిల్లా అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించనున్నారు. ఉమ్మడి పాలమూరులో ఐదు జిల్లాలు ఉండగా, మహబూబ్‌నగర్ మినహా మిగతా నాలుగు జిల్లాలకు ఇదే తొలి పాలకవర్గం. కొత్త జిల్లాల్లో మొదటిసారి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లుగా అందరూ బీఆర్ఎస్ నుంచే ఎన్నికయ్యారు. తర్వాత కొందరు పార్టీ మారారు. అయితే ఐదేళ్ల పాలనలో మెజారిటీ చైర్‌పర్సన్లు మంత్రులు, ఎమ్మెల్యేల చాటున పని చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అధికార వ్యవస్థ మొత్తం మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకృతం కావడంతో.. వారు అనుకున్న వారినే జడ్పీ చైర్‌పర్సన్లుగా నియమించుకున్నారు. కొన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలతో చైర్‌పర్సన్లకు విభేదాలు కూడా తలెత్తాయి. పాలన, పర్యటనలు, ప్రొటోకాల్ విషయంలో తరచూ బాహాటంగానే వివాదాలు నెలకొన్నాయి. జోగులాంబ గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ఆ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత ఒకే పార్టీ నుంచి ఎన్నికయ్యారు. అయితే సరిత ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించడం, సొంతంగా కేడర్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ప్రొటోకాల్ విషయాల్లో వారిద్దరికీ విభేదాలు వచ్చాయి. తర్వాత సరిత ఎన్నికల ముందు పార్టీ మారడంతో ఆ వివాదం సమసిపోయింది. వనపర్తి జిల్లాలో అప్పటి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి, జడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డికి మధ్య విభేదాలు నెలకొన్నాయి. లోక్‌నాథ్‌రెడ్డి ఒకసారి పార్టీకి రాజీనామా చేసి, తిరిగి మళ్లీ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మళ్లీ రాజీనామా చేసి.. బీజేపీలో చేరిపోయారు. మహబూబ్‌నగర్ జడ్పీచైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఎమ్మెల్యేల కేంద్రంగా పాలన నడిపించడం కారణంగానే విభేదాలు తలెత్తాయని చెప్పొచ్చు. అయితే అయిదేళ్ల పాలన తమకు సంతృప్తి నిచ్చిందని చెబుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు నిధులు, విధుల విషయంలో ప్రభుత్వం జిల్లా పరిషత్‌లపై ఎక్కువగా దృష్టి సారించాలని కోరుతున్నారు. స్థానిక సంస్థలతోనే ఎక్కువ అభివృద్ధి జరిగే అవకాశం ఉందని, భవిష్యత్‌లో జడ్పీలను ఇంకా బలోపేతం చేయాలని చెబుతున్నారు.

సంతృప్తినిచ్చింది



మహబూబ్‌నగర్: ఐదేళ్ల పాలన సంతృప్తిని ఇచ్చింది. సభ్యులందరికీ నా వంతు న్యాయం చేయడానికి ప్రయత్నం చేశా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగానే వచ్చినా.. కేంద్రం నుంచి నిధులు వచ్చాయి. బీఆర్ఎస్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు నాకు సహకరించారు. అధికారులు, ముఖ్యంగా జిల్లా పరిషత్ కార్యాలయ అధికారులు పూర్తి సహకారం అందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి తరువాత ఓ నాయకుడి ప్రోత్సాహంతో కిందిస్థాయి నాయకులు తనను అవమానించేలా ప్రవర్తించారు. దాంతో పార్టీ మారాల్సి వచ్చింది. చివరి జిల్లా పరిషత్ సమావేశాన్ని సభ్యులు బహిష్కరించడం బాధాకరం. దీని వెనుక ఎవరున్నారో నాకు తెలుసు. ఆ తరువాత అదే సభ్యులు మళ్లీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. తెలిసి నేను ఎక్కడా తప్పు చేయలేదు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. నేను ఏ పార్టీలో ఉన్నా.. రాజకీయాలు కాకుండా ఆ పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించా. కారుణ్య నియామకాలు 50 నుంచి 60 మందికి ఇచ్చినా.. ఇంకా 40 మంది వరకు మిగిలిపోయారు. ఆ నియామకాలు చేపట్టకపోవడం ఒక్కటే నాకు బాధగా ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నియామకాలు జరిగేలా కృషిచేస్తా. కొత్తగా వచ్చే సభ్యులకు ప్రభుత్వాలు.. నిధులు, అధికారాలు ఇవ్వాలి. రిజర్వేషన్ల కారణంగా ఎంతో మంది మహిళలు రాజకీయాల్లోకి వస్తున్నారు. అయితే భర్తలు పెత్తనం చేయకుండా మహిళలకు పనిచేసే అవకాశం కల్పించాలి. అప్పుడే వాళ్లు నేర్చుకుంటారు. సలహాలు ఇవ్వాలే తప్ప.. అధికారం చేతుల్లోకి తీసుకోవద్దు.

– స్వర్ణాసుధాకర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జడ్పీ చైర్‌పర్సన్

అభివృద్ధి చేశా



గద్వాల: ఐదేళ్లలో సాధ్యమైనంత వరకు చేయాల్సిన అభివృద్ధిని చేశా. ఆర్థిక సంఘం నిధుల్లో కోత విధించడంతో పాటు, స్టేట్ ఫైనాన్స్ నిధులు మూడేళ్లుగా రాలేదు. నిధుల్లో కోత ఉండటంతో మండలాలకు కేటాయింపులు తక్కువ అయ్యాయి. అయతే వచ్చిన నిధులను పూర్తిగా సద్వినియోగం చేశాం. విద్య, హెల్త్, రోడ్లు, మురికి కాలువలకు ఎక్కువగా కేటాయించాం. పాఠశాలలను బలోపేతం చేసేందుకు మరమ్మతులు చేయించాం. జడ్పీ సమావేశాలలో ప్రజల సమస్యలు అధికారుల ద్వారా పరిష్కారం అయ్యేలా చూశాను. పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాను. అన్ని సమావేశాల్లో సభ్యులు పూర్తి సహకారం అందించారు. నేను జడ్పీని నిర్వహించగలననే నమ్మకంతో ఎమ్మెల్యేలు మీటింగ్‌లకు హాజరు కాకపోవచ్చు. జిల్లా ప్రజల నుంచి పూర్తి సహాయ సహకారాలు అందడంతో నేను చాలా సంతోషంగా ఉన్నాను.

– సరిత, జోగుళాంబ గద్వాల జడ్పీ చైర్‌పర్సన్

అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి



అయిదేళ్ల కాలంలో తొలి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పాలన సంతృప్తినిచ్చింది. సభ్యులు, అధికారుల సహకారంతో అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశాను. ప్రధానంగా ఈజీఎస్‌లో భాగంగా రైతు వేదికలు, పార్కులు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించాం. హెల్త్ గ్రాంట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లాలో 39 హెల్త్ సబ్ సెంటర్లను ఏర్పాటు చేసుకున్నాం. కంటి వెలుగు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినా.. దానికోసం జిల్లా పరిషత్‌లు నిధులు ఖర్చు చేసింది. పాఠశాలల భవనాలు, మరమ్మతుల కోసం సుమారు రూ.10 కోట్లు ఖర్చు చేశాం. 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనింగ్ రాయల్టీని సమర్థవంతంగా పనుల కోసం ఖర్చు చేశాం. 32 జిల్లాలకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో తమకు కూడా అవే సమస్యలు ఉన్నాయి. విధులు, నిధుల్లో అందరికీ అసంతృప్తి ఉంది. స్థానిక సంస్థల బలోపేతం కోసం ప్రభుత్వాలు భవిష్యత్‌లో నిధులు పెంచడంతోపాటు అధికార వికేంద్రీకరణ చేపట్టాలి.

– ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి, వనపర్తి జిల్లా పరిషత్ చైర్మన్

అందరి సహకారం లభించింది



నాగర్‌కర్నూల్ (ఆంధ్రజ్యోతి): నేను ఏడాదిన్నర కాలం జడ్పీ చైర్‌పర్సన్‌గా పని చేశా. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల అందరి సహకారం లభించింది. దళిత మహిళ అయిన తనకు అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ ప్రకారం జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. కానీ ఆ అవకాశం ఐదేళ్లపాటు లేకపోవడం చిన్న అసంతృప్తి. పని చేసిన కొద్ది కాలమైనా ఉన్న అవకాశాలు, వనరులను వినియోగించుకుని వీలైనంత వరకు పనులు చేయగలిగాను. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ఏర్పడిన మొదటి జడ్పీకి నా హయాంలో సొంత భవనం నిర్మించాలనే కోరిక నెరవేరలేదు. భవిష్యత్‌లో అవకాశాలు వస్తే సద్వినియోగం చేసుకుంటా.

– బి.శాంతకుమారి, నాగర్‌కర్నూల్ జడ్పీ చైర్‌పర్సన్

అసంతృప్తి ఉంది



నారాయణపేట టౌన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలందించే జడ్పీ చైర్‌పర్సన్ పదవి లభించడం అదృష్టంగా భావిస్తున్నా. కానీ ఐదేళ్లలో ఆశించిన మేరకు సేవ చేయలేకపోయాననే అసంతృప్తి మిగిలింది. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిది. ప్రభుత్వం జడ్పీటీసీ సభ్యులకు నిధులను విడుదల చేయకపోవడంతో జడ్పీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించడం బాధ కలిగించింది. ఐదేళ్లలో సహకరించిన పాలకవర్గానికి, అధికారులకు కృతజ్ఞతలు. ఐదేళ్లలో 18 సర్వసభ్య సమావేశాలను నిర్వహించాం.

– వనజమ్మ, నారాయణపేట జడ్పీ చైర్‌పర్సన్

పుట్టిన గడ్డకు.. సీఎం పెద్దపీట



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రేవంత్‌రెడ్డి నిధులు
- రూ.2 కోట్లతో కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం, పశువైద్య కేంద్రం నిర్మాణం
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లకు మరో రూ.18 కోట్లు మంజూరు
- కిష్టంపల్లి గేటు నుంచి కల్వకుర్తి వరకు డబుల్ రోడ్డుకు రూ.36 కోట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు



నిర్మాణంలో ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్

కల్వకుర్తి, జూలై 3: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తాను పుట్టిన గ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి పెద్దపీట వేశారు. గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయగా, వేగంగా కొనసాగుతున్నాయి. కొన్నింటి కోసం సర్వే చేస్తున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.18 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో గ్రామంలో ఏడు కిలో మీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు సర్వే కొనసాగుతోంది. వెటర్నరీ ఆస్పత్రి మంజూరు కావడంతో పశువైద్య కేంద్రాన్ని తాత్కాలిక భవనంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ ప్రారంభించారు.

ఏర్పాటు కానున్న 30 పడకల ఆస్పత్రి

గ్రామంలో పాడి రైతుల కోసం బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ భవన నిర్మాణానికి అధికారులు స్థలాన్ని గుర్తించారు. అదే విధంగా 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా మంజూరు కానుందని తెలుస్తోంది. రైతు వేదికలో అధునాతన వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యమూ అందుబాటులోకి రానుంది. పార్కు, కాంపౌండ్ వాల్స్, ఎల్‌ఈడీ లైట్లు, హైమాస్ లైట్లు, ఫుట్‌పాత్‌లు, ఓపెన్ జిమ్‌లకు రూ.2 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. గ్రామంలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వంగూరు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం మండల సమీకృత భవనాల సముదాయ నిర్మాణానికి రూ.66 కోట్లతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

వంగూరు మండలంలో..

వంగూరు మండలంలో డబుల్ రోడ్లు, మండల సమీకృత కాంప్లెక్స్, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మండలంలోని కిష్టంపల్లి గేటు నుంచి వయా వంగూరు, తుమ్మలపల్లి, కొండారెడ్డిపల్లి, తిమ్మరాసిపల్లి మీదుగా కల్వకుర్తికి డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తికానుంది.

రూ.2 కోట్లతో భవన నిర్మాణాలు

గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్, దివంగత ఆర్మీ జవాన్ యాదయ్య పేరున లైబ్రరీ బిల్డింగ్, పశు వైద్య కేంద్రభవనం, గ్రామ పంచాయతీ అదనపు గది రికార్డు రూమ్‌కు నిర్మాణాలకు రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో బీసీ కమ్యూనిటీ హాల్ పూర్తి కావస్తుండగా, గ్రామ పంచాయతీ అదనపు గది రికార్డు రూమ్ పనులు చివరి దశలో ఉన్నాయి. లైబ్రరీ భవనం, వెటర్నరీ ఆస్పత్రి నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అదే విధంగా కల్వకుర్తి-శ్రీశైలం జాతీయ రహదారి వద్ద గల కొండారెడ్డిపల్లి గేటు నుంచి ఆరు కిలో మీటర్ల వరకు నాలుగు లేన్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.14 కోట్లా 50 లక్షలు మంజూరయ్యాయి. ఆ పనులకు టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయ్యింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

సీఎం సహకారంతో మండల అభివృద్ధి



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సహకారంతో వంగూరు మండలాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. మండల కేంద్రంలో సమీకృత కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.66 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి. కిష్టంపల్లి గేటు నుంచి వయా వంగూరు, కొండారెడ్డిపల్లి, తిమ్మరాసిపల్లి, కల్వకుర్తికి డబుల్ రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. కొండారెడ్డిపల్లిలో సైతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

– కేవీఎన్.రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు, వంగూరు

పనులు నాణ్యతగా చేయిస్తున్నాం



కొండారెడ్డిపల్లి గ్రామంలో భవన నిర్మాణాల పనులు నాణ్యతగా, సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బీసీ కమ్యూనిటీ హాల్ భవనం, గ్రామ పంచాయతీ అదనపు గదుల రికార్డు రూమ్ పనులు దాదాపుగా పూర్తికావచ్చింది. పశువైద్యశాల, గ్రంథాలయం భవనాల పనులు కొనసాగుతున్నాయి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణాలకు సర్వే చేస్తున్నాం.

– మణిపాల్‌నాయక్, ఏఈ

నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ అదనపు గది



ఆ పోస్టులొస్తే మహబూబ్‌నగర్ మెడికల్ హబ్

- ఐదు జిల్లాల వైద్య కళాశాలల నుంచి పాలమూరుకు 68 పోస్టులు బదిలీ
- స్పెషాలిటీ డాక్టర్ పోస్టులు 39, సూపర్ స్పెషాలిటీ డాక్టర్ పోస్టులు 29
- గత ఏడాదే జీవో జారీ
- నేడు మంత్రి సమీక్షలో చర్చించే అవకాశం



మహబూబ్‌నగర్‌లోని మెడికల్ కళాశాల

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జూలై 3: మహబూబ్‌నగర్ మెడికల్ హబ్‌గా మారేందుకు అన్ని అవకాశాలూ ఉన్నాయి. కానీ తగిన డాక్టర్లు లేకపోవడంతో వెనుకడుగు పడుతోంది. ఇప్పటికే 600 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కూడా నిర్మాణంలో ఉండటంతో మరిన్ని పోస్టులు అవసరం ఉన్నాయి. అయితే అప్పటి అధికారుల అనాలోచిత నిర్ణయాల వలన ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు సమయంలో సరైన పోస్టులు రాలేకపోయాయి. మహబూబ్‌నగర్ కళాశాలకు తక్కువ పోస్టులు ఉన్నాయని గుర్తించిన గత ప్రభుత్వం రాష్ట్రంలోని కొత్త వైద్య కళాశాలల నుంచి 68 పోస్టులను అక్కడికి బదిలీ చేసింది. జీవో జారీ చేసినప్పటికీ అమల్లోకి రాలేదు. ఇప్పటికైనా జిల్లాలోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో మాట్లాడి ఆ పోస్టులు సాధిస్తే మహబూబ్‌నగర్ రాష్ట్రంలోనే మరో ఉస్మానియా ఆస్పత్రి స్థాయిలో సేవలందించే అవకాశం ఉంది. నేడు జిల్లా మంత్రితో ఉన్న సమీక్షలో ఈ విషయమై చర్చించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

అధికారుల అనాలోచిత నిర్ణయం ఫలితం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి వైద్య కళాశాలను పాలమూరుకు మంజూరు చేశారు. ఆ సమయంలో కళాశాల అధికారులు అనాలోచిత నిర్ణయాల వలన స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీకి సంబంధించిన పోస్టులను తక్కుగా పెట్టారు. కొన్ని పోస్టులను క్రియేట్ కూడా చేయలేదు. దీంతో జిల్లాలోని వైద్య కళాశాలలో డాక్టర్ల పోస్టులు తక్కువగా ఉన్నాయి. మిగతా జిల్లాల్లో సరిపోను పోస్టులు పెట్టడంతో అన్ని కళాశాలల్లో అన్ని పోస్టులు ఉన్నాయి.

ఇతర కళాశాలల నుంచి పోస్టుల బదిలీ..

మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో పోస్టులు తక్కువగా ఉండటంతో స్పందించిన ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో గల వైద్య కళాశాలల నుంచి 68 పోస్టులను బదిలీ చేసింది. ఈమేరకు గత ఏడాది జూలైలో జీవో ఆర్‌టీ నంబర్ 397 విడుదల చేసింది. అందులో స్పెషాలిటీ విభాగంలో ప్రొఫెసర్ పోస్టులు 3, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 36, సూపర్ స్పెషాలిటీ విభాగంలో ప్రొఫెసర్ పోస్టులు 9, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 9, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 11 పోస్టులు ఉన్నాయి. అందులో న్యూరో సర్జరీ, న్యూరాలజీ, సీటి సర్జన్, కార్డియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటాలజీ, యూరాలజీ, ఎండోక్రైటాలజీ పోస్టులు ఉన్నాయి.

ఐదు జిల్లాల కొత్త కళాశాలల నుంచి..

రాష్ట్రంలోని ఐదు జిల్లాలకు కొత్తగా మంజూరు చేసిన మెడికల్ కళాశాలల్లో ఎక్కువగా ఉన్న పోస్టులను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేశారు. అందులో వనపర్తి, నాగర్‌కర్నూల్, జగిత్యాల, మహబూబాబాద్, సంగారెడ్డి మెడికల్ కళాశాలలు ఉన్నాయి. వనపర్తి మెడికల్ కళాశాల నుంచి 20, నాగర్‌కర్నూల్ నుంచి 27, సంగారెడ్డి నుంచి 18, మహబూబాబాద్ నుంచి రెండు, జగిత్యాల నుంచి ఒక పోస్టు బదిలీ చేశారు. ఆయా కళాశాలల నుంచి ఈ పోస్టులు మహబూబ్‌నగర్ కళాశాలకు బదిలీ కావడంతో అక్కడ ఈ పోస్టులు రద్దు కానున్నాయి.

ఉమ్మడి జిల్లాకు మేలు..

మహబూబ్‌నగర్ వైద్య కళాశాలకు ఈ పోస్టులు బదిలీ అయితే ఉమ్మడి పాలమూరుకు మేలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో రోజుకు 1,500 మంది వరకు ఓపీ కోసం వస్తున్నారు. దాదాపుగా హైదారబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి వచ్చే ఓపీ సంఖ్య ఇక్కడ కూడా ఉండడం గమనార్హం. దీంతో పాటు 600 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కూడా నిర్మాణంలో ఉంది. ఇది పూర్తయితే సరిపోయినన్ని పోస్టులు ఉండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలకు మరింత మేలు జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా ఈ పోస్టులు రావడంతో పీజీ సీట్లు కూడా పెరిగి, ఎంతో మంది వైద్య విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఇదిలా ఉండగా వనపర్తి మెడికల్ కళాశాలలో ప్లాస్టిక్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్, న్యూరో సర్జరీ, సీటి సర్జన్ పోస్టులు ఉన్నాయి. కళాశాలలో న్యూరో సర్జన్ కేసులు లేకపోవడంతో ఉస్మానియాకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్లాస్టిక్ సర్జన్ కూడా పోస్టింగ్ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు రిపోర్ట్ చేయలేదు. సీటి సర్జన్ డాక్టర్ ఉన్నప్పటికి ఓపీ లేకపోవడంతో ఇతర సర్జరీలు చేస్తున్నారు. మిగతా జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ప్రభుత్వం స్పందించి బదిలీ ఉత్తర్వులను అమలు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నేటి మంత్రి సమీక్షలో చర్చిస్తాం

రాష్ట్రంలోని కొత్త వైద్య కళాశాలల నుంచి 68 పోస్టులను గత ప్రభుత్వం మహబూబ్‌నగర్ కళాశాలకు బదిలీ చేసింది. అందుకు సంబంధించిన జీవో కూడా జారీ అయినా.. ఇప్పటి వరకు అమల్లోకి రాలేదు. దీనిపై అప్పటి మంత్రికి, సీఎంకు కూడా వినతిపత్రం సమర్పించాం. ఇప్పటి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి, మంత్రి జూపల్లి దృష్టికి కూడా తెచ్చాం. నేడు కలెక్టరేట్‌లో మంత్రితో సమీక్ష సమావేశం ఉంది. అందులో చర్చిస్తాం. ఎలాగైనా ఆ జీవోను అమల్లోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

– డా. రమేష్, ప్రభుత్వ వైద్యకళాశాల డైరెక్టర్



కాంగ్రెస్‌లో చేరాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కాంగ్రెస్‌లో చేరండి.. రాజీనామాతోనే రండి

- హస్తం కండువా కప్పుకోవాలని కృష్ణమోహన్‌రెడ్డికి బీఆర్ఎస్ కార్యకర్తల వినతి
- పదవిని వీడితేనే కాంగ్రెస్‌లో చేర్చుకోవాలి: సరితకు కార్యకర్తల సూచన

గద్వాల, జూలై 3: గద్వాల అభివృద్ధి కోసం శ్రమిస్తున్న మీరు కాంగ్రెస్ పార్టీలో చేరి, మరింత అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని లిఖిత పూర్వకంగా కోరగా.. కాంగ్రెస్‌లో చేరాలంటే ముందు ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రావాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జడ్పీ చైర్‌పర్సన్ సరితను కోరారు. రెండు పార్టీల కార్యకర్తలు ఇలా కోరడం నియోజకవర్గంలో బుధవారం హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ అధిష్ఠానంతో పాటు ఎంపీ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావు వద్దకు తీసుకెళ్లారు. అందుకు వారు ఎలాంటి చేరిక లేదని ఆమెకు గట్టి హామీ ఇచ్చారు. అదే సందర్భంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చెప్పి సామాజిక మాధ్యమాలు, మీడియాలో వస్తున్న ప్రచారానికి తెరదించారు. గత రెండు రోజులుగా ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరుతున్నారని, ఈ నెల ఎనిమిది లేదా 16వ తేదీలలో చేరతారని మళ్లీ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. గద్వాల అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరాలంటూ మల్దకల్, గట్టు మండలాలకు చెందిన కార్యకర్తలు బుధవారం లిఖిత పూర్వకంగా ఎమ్మెల్యేకు విన్నవించారు. అదే సందర్భంలో కాంగ్రెస్‌లో చేరాలంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, చేరేలా చూడాలని కాంగ్రెస్ కార్యకర్తలు సరితను లిఖిత పూర్వకంగా కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు ఇచ్చిన లేఖలో.. కాంగ్రెస్ నాయకుల అరాచకాలు, దోపిడీని అరికట్టి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆ పార్టీలో చేరాలని కార్యకర్తలు కోరగా, బీఆర్ఎస్‌లో చేసిన అవినీతి అక్రమాలు, దోపిడీలు బయట పడతాయనే తమ పార్టీలో చేరుతున్నారని, దీనిని అడ్డుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు.

నిధులు లేక ఇబ్బందులు

- పంచాయతీల్లో పడకేసిన పారిశుధ్యం
- ఇబ్బందుల్లో గ్రామ కార్యదర్శులు

అలంపూర్ చౌరస్తా, జూలై 3 : సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ఆ బాధ్యతలను ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. అయితే అయిదు నెలలుగా సెంట్రల్ ఫండ్స్, ఏడాదిన్నరగా ఎస్ఎఫ్‌సీ నిధులు రాకపోవడం సమస్యగా మారింది. కొన్ని పంచాయతీల్లో నిధులు పూర్తిగా ఖాళీ కావడంతో కార్యదర్శులు కూడా చేతులెత్తేసే పరిస్థితి నెలకొన్నది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 55 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటిలో 120 చిన్న పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో పారిశుధ్య పనులు, చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించారు. చిన్న పంచాయతీలకు వచ్చే నిధుల్లో ఎక్కువశాతం ప్రతీ నెల కార్మికుల జీతాలు, ట్రాక్టర్లకు డిజిల్, మరమ్మతులు, కరెంటు బిల్లులు తదితరాలకే ఖర్చు అవుతున్నాయి. తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతుకు అయ్యే ఖర్చు అదనం. ఈ నేపథ్యంలో అభివృద్ధి ఊసే లేకుండా పోయింది.


చెన్నిపాడు గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

పంచాయతీలకు సరిపోని నిధులు

చిన్న పంచాయతీల్లో ఏడాదికోసారి వసూలయ్యే ఇంటి పన్ను రెండు నెలల ఖర్చులకు కుడా సరిపోదని కార్యదర్శులు చెప్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే పల్లె ప్రగతి నిధులే దిక్కయ్యాయి. సగటున ప్రతీ పంచాయతీకి ఏడాదికి సుమారు రూ.10 లక్షల నుంచి 15 లక్షల నిధులు వస్తాయి. వాటిలో ట్రాక్టర్ డిజిల్, మరమ్మతులు, కార్మికుల వేతనాలు, కరెంటు బిల్లులకు దాదాపు రూ.7.5 లక్షల వరకు ఖర్చవుతాయి. వచ్చే నిధుల్లో సగం ఈ ఖర్చులకే సరిపోతే గ్రామాల్లో మోటార్ల మరమ్మతు, తాగునీటి లీకేజీలు సరిచేయడం, ట్యాంకులను శుభ్రం చేసేందుకు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, రోడ్ల మరమ్మతు తదితర పనులు ఎలా చేయాలని కార్యదర్శులు అంటున్నారు. దీనికి తోడు రాష్ట్రం నుంచి వచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు 16 నెలలుగా రావడం లేదని, అయిదు నెలలుగా సెంట్రల్ ఫండ్ కూడా రావడం లేదని చెప్తున్నారు. దీంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారిందంటున్నారు. దీంతో పల్లెల్లో పారిశుధ్య పనులు జరగడం లేదు. కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని చోట్ల ట్రాక్టర్లకు డీజిల్ లేక తోపుడుబండ్లలో చెత్తను తరలించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

నిధులు అయిపోయాయి

మానవపాడు మండలంలోని పెద్దపోతులపాడు గ్రామంలో 1,573 వందల మంది జనాభా ఉంది. గ్రామానికి అరు నెలలకోసారి సెంట్రల్ నుంచి 15వ ప్రణాళిక సంఘం నిధులు రూ.1.60 లక్షల వరకు వస్తున్నాయి. గ్రామంలో ఐదుగురు కార్మికులు, ఒక స్కావెంజర్ ఉన్నారు. వీరి వేతనాలకు ప్రతీ నెల రూ.50 వేలు, ట్రాక్టర్ డిజిల్, మరమ్మత్తుల కోసం ఎనిమిది వేలు, కార్యాలయం అవసరాలకు మూడు వేలు, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతుకు రూ.10వేలు, కరెంటు బిల్లులు నాలుగు వేల రూపాయల వరకు ఖర్చు అవుతున్నాయి. అంటే అరు నెలలకోసారి వచ్చే కేంద్రం నిధులు రెండు నెలలకే సరిపోతున్నాయి. దీంతో బిల్లులు పెండింగ్‌లో పడుతున్నాయని కార్యదర్శులు చెప్తున్నారు. పంచాయతీ కార్మికులకు రెండు నెలలుగా జీతాలు, ట్రాక్టర్ల నిర్వహణ, డీజిల్ బిల్లులు, పైపుల లీకేజీల మరమ్మతులకు సంబంధించిన బిల్లులు, ఇతర ఖర్చులతో కలిసి దాదాపు రూ. 1.04 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి ఎండీ ఫయాజ్ తెలిపారు.


శివనంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఎనిమిది నెలలుగా అద్దె పెండింగ్

ఇది ఇటిక్యాల మండలంలోని శివనోంపల్లి పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం. గ్రామంలో 710 మంది జనాభా ఉంది. నూతనంగా ఏర్పడిన ఈ పంచాయతీ నూతన భవనం నిర్మాణంలో ఉండటంతో అద్దె భవనంలోనే కొనసాగుతోంది. నిధులు లేక ఎనిమిది నెలలుగా అద్దె చెల్లించడం లేదు. ట్రాక్టర్ కిస్తులు చెల్లించలేక పోవడంతో ఇటిక్యాల పంచాయతీ నిధుల నుంచి రూ.50 వేలు చెల్లించారు. ఇంకా 10 నెలల కిస్తులు చెల్లించాల్సి ఉంది. ఇక్కడ పని చేస్తున్న ఇద్దరు కార్మికులకు 10 నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దాదాపు రూ.80 వేల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బ్లీచింగ్ పౌడర్, ట్రాక్టర్ డీజిల్ కోసం ప్రస్తుత కార్యదర్శి మద్దిలేటి ప్రతీ నెల ఎనిమిది వేల రూపాయలను సొంతంగా ఖర్చు చేస్తున్నారు.

నిధులు రావాల్సి ఉంది

చిన్న పంచాయతీల్లో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. సెంట్రల్ ఫండ్ నాలుగు నెలల క్రితం మంజూరయ్యింది. ఆ నిధులతోనే పంచాయతీల నిర్వహణ కొనసాగుతోంది. రాష్ట్రం నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు త్వరలో రానున్నాయి. ఆ నిధులు వస్తే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

- వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి డీపీవో

ఎంపీపీ వర్సెస్ తహసీల్దార్

- శిలాఫలకం తొలగించే యత్నం
- పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న తహసీల్దార్
- భవనం ప్రారంభానికి పట్టుబట్టిన ఎంపీపీ
- వైద్య ఆరోగ్య శాఖ అధికారుల గైర్హాజరు

ఖిల్లాఘణపురం, జూలై3: మండలంలోని కర్నేతండాలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల నిధులు 2 కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభోత్సవం బుధవారం ఎంపీపీ వర్సెస్ తహసీల్దార్ మధ్య రసాభాసగా మారింది. ప్రాథమిక ఆరోగ్య భవనానికి విద్యుత్ సరఫరా, నీటి సౌకర్యం, ఫర్నిచర్ లాంటి సదుపాయాలు లేకుండా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం అందించకుండా నూతన భవన ప్రారంభోత్సవం చేయరాదని కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ పాండు ఆసుపత్రి ముందు ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని తొలగించడానికి సిద్ధపడ్డారు. భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఎలా తొలగిస్తారని ఎంపీపీ కృష్ణానాయక్ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకం తొలగించే క్రమంలో తహసీల్దార్ పాండు చేతి వేలికి గాయమైంది. కొంతవరకు తొలగించిన శిలాఫలకం రేకును తిరిగి గిరిజన నాయకులు బిగించారు. ఎంపీపీ, తహసీల్దార్ మధ్య వాగ్వాదం జరిగే క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభించడానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేరుకుని ఆసుపత్రి భవనం ముందు కొబ్బరికాయ కొట్టడంతో ఎంపీపీ కృష్ణా నాయక్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆసుపత్రి భవనం ముందుకు రావడంతో అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీపీ కృష్ణానాయక్, జడ్పీటీసీ సామ్య నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ప్రసంగిస్తూ దొడ్డి దారిన టికెట్ పొంది గెలుపొందిన నియోజకవర్గ ప్రతినిధి అభివృద్ధిని అడ్డుకుంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేసేలా బెదిరిస్తున్నారని అన్నారు. అధికారులపై ఒత్తిడి తెస్తు దిగజారుడు రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. సమావేశం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


కర్నేతండాలో పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ కృష్ణానాయక్

కరెంట్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్‌కు గాయాలు

తెలకపల్లి, జూలై 3 : ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురై జూనియర్ లైన్‌మెన్ తిరుపతిరెడ్డికి తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కొల్లాపూర్ చౌరస్తాలో బుధవారం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వివరాల ప్రకారం... దేశిటిక్యాల పరిధికి చెందిన జూనియర్ లైన్‌మెన్ తిరుపతిరెడ్డి కొల్లాపూర్ చౌరస్తాలో ట్రాన్స్‌ఫార్మర్ పని చేసేందుకు వెళ్లి ఏబీస్విచ్ మరమ్మతు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ రావడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి కింద పడిపోయాడు. దీంతో తిరుపతిరెడ్డికి కుడికాలు ఎడమ చేయికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఆటో బైక్ ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 3: ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండ గేటు సమీపంలో ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో బాలరాజు, గోపాల్ అనే ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరు వ్యక్తులు నాగర్‌కర్నూల్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందినవారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

మిడ్జిల్, జూలై 3 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఏఎస్ఐ బాలకృష్ణ బుధవారం తెలిపారు. ఏఎస్ఐ కథనం ప్రకారం వివరాల... సదరు యువతి బుధవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిందని, కొద్దిసేపటి తర్వాత చూస్తే ఎక్కడా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్లాట్ల ఫెన్సింగ్ తొలగించారని ఫిర్యాదు

జడ్చర్ల, జూలై 3 : జడ్చర్ల మునిసిపాలిటీలోని విద్యానగర్ కాలనీలోని సర్వే నెంబరు 65లో 2016 జూన్ 9న 820 గజాల స్థలాన్ని కొనుగోలు చేసుకుని, ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నామని, ఆ ఫెన్సింగ్‌ను మేకల శంకరయ్య, మేకల శివలతో పాటు మరికొందరు తొలగించారంటూ ప్లాట్ల యజమాని వాకిటి బాల్‌రెడ్డి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నామని, ప్లాట్లకు సంబంధించిన హద్దు రాళ్లు, ఫెన్సింగ్‌ను తొలగించారంటూ బుధవారం బాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 3 : మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీకి సంబంధించిన క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు బుధవారం జరిగాయి. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు జరగగా ప్రతిభ కనబరిచిన సింగిల్స్‌లో బాలుర 8 మంది, బాలికలు నలుగురు, డబుల్స్‌లో బాలురు నలుగురు మెయిన్ డ్రాకు అర్హత పొందారు. రాష్ట్రస్థాయి అండర్-19 బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయని మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్. శ్యామ్ సుందర్‌గౌడ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్ తెలిపారు. నాలుగు కోర్టుల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఈ నెల ఆరున టోర్నీ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్ ఖాన్, ఉపాధ్యక్షులు విజయ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

» 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్

» ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

» టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

» సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ

» కనీస చర్యలూ తీసుకోని వైనం

» ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

సారూ దయచూపరూ..

» తెలంగాణలో విధుల్లో 2వేల మంది ఆంధ్ర హోంగార్డులు

» స్వరాష్ట్రానికి పంపాలని గతంలో రెండు ప్రభుత్వాలకు పలుమార్లు వినతి

» ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ నేపథ్యంలో మరోసారి వేడుకోలు

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్ శాఖలో పనిచేస్తున్న సుమారు 2వేల మంది హోంగార్డుల కుటుంబాలు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఏపీకి చెందిన పలు జిల్లాల నుంచి హోంగార్డులు విధుల్లో చేరారు. అయితే రాష్ట్ర విభజన సమయంలో సుమారు 2 వేల మంది ఏపీ స్థానికత కలిగిన హోంగార్డులు తెలంగాణలోనే ఉండిపోయారు. అలాగే తెలంగాణ స్థానికత కలిగిన సుమారు 500 మందికిపైగా హోంగార్డులు ఏపీలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే హోంగార్డుల గౌరవ వేతనం తక్కువ ఉండటం, ఆర్జిత సెలవులు లేకపోవడం కుటుంబాలను నెట్టుకురావడం ఇబ్బందికరంగా ఉంది. తెలంగాణలో గత సీఎం కేసీఆర్ హోంగార్డుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. ఏపీ మాజీ సీఎం దృష్టికి హోంగార్డులు తమ సమస్య తీసుకెళ్లగా సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు.. కానీ ఉపయోగం లేకుండాపోయింది. తమ సమస్య పరిష్కరించాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండాపోయింది. తాజాగా రెండు రాష్ట్రాల సీఎంలు భేటీకానున్న నేపథ్యంలో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని మరోసారి హోంగార్డులు వేడుకుంటున్నారు. ఏపీ స్థానికత ఉన్న హోంగార్డులు తెలంగాణలో చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నారు. భార్యాపిల్లలు ఇక్కడ, తల్లిదండ్రులు సొంత ఊళ్లో ఉండటంతో వచ్చే కొద్దిపాటి జీతం సరిపోక ఇబ్బందిగా మారిందని, సొంత ఊళ్లకు పంపితే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు తోడుండే ఆస్కారం ఉంటుందని హోంగార్డులు అంటున్నారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ప్రాంత హోంగార్డులు ఇవే సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిని ఇక్కడకు రప్పించి, తమను అక్కడకు పంపాలని కోరుతున్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ పనిచేస్తున్న ఏపీకి చెందిన సుమారు 500 మంది హోంగార్డులకు ఎన్‌వోసీ ఇచ్చినా.. అక్కడి ప్రభుత్వం అంగీకారం తెలపకపోవడంతో వారికి నిరాశే మిగిలింది. హోంగార్డుల విషయంలో పరస్పర బదిలీలకు ఆస్కారం లేకపోవడంతో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని హోంగార్డులు పోలీస్ ఉన్నతాధికారులు, ప్రభుత్వాల్ని వేడుకుంటున్నారు.

ఇక్కడ నాన్‌లోకల్.. అక్కడ కోటా వర్తించదు..!

పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేసే వారికి కానిస్టేబుల్ నియామకాల్లో ప్రత్యేక కోటా ఉంటుంది. అయితే ఏపీ స్థానికత ఉండటంతో తెలంగాణ పోలీస్ నియామకాల్లో వారిని నాన్‌లోకల్‌గా పరిగణించి కోటా వర్తింపజేయడంలేదు. ఏపీ పోలీస్ నియామకాల్లో తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నందున కోటా వర్తించదని చెబుతున్నారు. ఉద్యోగ నియామకాల్లోనూ తమ కోటాను ఉపయోగించుకునే పరిస్థితిలేకుండా పోయిందని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఉద్యోగం వల్ల పిల్లల స్థానికతపైనా ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. వీలైనంత త్వరగా తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

» చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం

» 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లులుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

పీయూలో ఉచిత హెల్త్ క్యాంప్

» రక్తదానం చేసిన విద్యార్థులు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 3 : పాలమూరు యూనివర్సిటీ, ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజ్ వారి సంయుక్తంగా యూనివర్సిటీలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ క్యాంపును, రక్తదాన శిబిరాన్ని పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, పీయూ అధికారులు, ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల అధికారులతో కలిసి పీయూ పీజీ కళాశాల ఆవరణలో బుధవారం ప్రారంభించారు. ఎస్‌వీఎస్ వైద్యులు, వైద్యవిద్యార్థులు పీయూ విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అవసరమైన వారికి ప్రత్యేక టెస్టుల కోసం ఎస్‌వీఎస్ వైద్య కళాశాలకు రాశారు. ఈ హెల్త్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు, పీయూ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ హెల్త్ క్యాంపును వినియోగించుకున్న వారు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉల్లి ధర క్వింటాలుకు రూ.3,250



దేవరకద్ర మార్కెట్ యార్డులో ఉల్లికి వేలం నిర్వహిస్తున్న వ్యాపారులు

దేవరకద్ర, జూలై 3 : ఉల్లి ధరలు గత వారంతో పోల్చుకుంటే మరింత పెరిగాయి. ప్రస్తుతం ఉల్లి పంట సీజన్ తగ్గిన తర్వాత ధరలు పైపైకి పెరుగుతున్నాయి. రెండు వారాల కిందట కొంత వరకు తగ్గిన ఉల్లి ధర బుధవారం జరిగిన వేలంలో మరింత పెరిగింది. వర్షాలు లేకపోవడంతో రైతులు నిల్వ చేసిన ఉల్లిని మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చారు. మార్కెట్‌లో జరిగిన ఉల్లి బహిరంగ వేలంలో గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.3250, కనిష్ఠంగా రూ.2350 ధరలు పలికాయి. నెల రోజుల నుంచి కొంత పెరుగుతోంది. 121 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. గత వారం కంటే ఈ వారం రూ.150 ధర పెరిగింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సిద్ధార్థ (ఫైల్)

బిజినేపల్లి, జూలై 3 : బైక్‌కు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గోవింద సిద్ధార్థ (18) అనే యువకుడు మృతి చెందినట్లు బుధవారం బంధువులు తెలిపారు. మండలంలోని పాలెం గ్రామానికి చెందిన సిద్ధార్థ నాగర్‌కర్నూల్‌లోని తమ డ్రైక్లినింగ్ షాపునకు బైక్‌పై పాలెం నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తుండగా కొల్లగడ్డ బస్టాండ్ సమీపంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డుపై కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సిద్ధార్థ చెన్నైలో ఐఐటీ మొదటి సంవత్సరం పూర్తి చేసుకొని మూడు రోజుల క్రితం సెలవుల్లో స్వంత గ్రామానికి వచ్చాడు. మృతుడికి తమ్ముడు, తండ్రి గోవింద శేఖర్, తల్లి ఉన్నారు.

7న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 3 : హైదరాబాద్‌లో త్వరలో జరగనున్న హెచ్‌సీఏ టూడేస్ లీగ్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఈ నెల ఏడున ఎంపిక చేస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ఆధార్‌కార్డు, బోనఫైడ్, జనన ధ్రువపత్రంతో హాజరుకావాలని సూచించారు.

ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

పాలమూరు, జూలై 3 : పది, ఇంటర్, నీట్, ఐఐటీ, ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సగర (ఉప్పర) కులానికి చెందిన విద్యార్థులకు సగర సేవాసమితి ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షుడు బి.పర్వతాలు, యం.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, సెల్‌ఫోన్ నెంబర్‌తో జూలై 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సగర(ఉప్పర) సేవా సమితి నాయకుల(94901 27423)ను కలవాలన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

తెలకపల్లి, జూలై 3 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని తాళ్లపల్లి సమీపంలో దుందుభి నది వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వివరాల ప్రకారం... కానిస్టేబుల్ ఉషన్న, కృష్ణలు కలిసి బ్లూకోల్ట్ విధులు నిర్వహించే క్రమంలో తాళ్లపల్లి నుంచి నడిగడ్డ గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో సోలార్ యూనిట్ దగ్గర ఒక ఇసుక టిప్పర్ వచ్చింది. ఎలాంటి అనుమతి పత్రాలు లేవని దుందుభీ వాగు నుంచి తీసుకునిపోతున్నట్లు తెలపడంతో తాడూరు మండల పరిధిలోని చెర్లటిక్యాలకు చెందిన డ్రైవర్ మంతటి కుర్మయ్య, టిప్పర్ యజమాని చంద్రశేఖర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

● ఉప్పునుంతల : మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన తైలి కురుమూర్తి ట్రాక్టర్ డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా దుందుభి వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున బ్లూకోట్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎ శ్రీనివాసులు ఉప్పునుంతల మండల కేంద్రంలోని కోటబురుజు వద్ద ఇసుక ట్రాక్టర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

డిండిచింతపల్లి వాగు వద్ద మూడు ట్రాక్టర్లు..

వంగూరు: మండలంలోని డిండిచింతపల్లి వాగు నుంచి బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

కేటీదొడ్డి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్లాపురం తండా పరిసరాలలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గవ్వ తిమ్మప్ప తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ఆపి తనిఖీ చేశారు. అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొలచింతలపల్లిని సందర్శించిన కలెక్టర్



భ్రమరాంబ కాలనీ చెంచులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొల్లాపూర్, జూలై 3 : కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లి గ్రామాన్ని బుధవారం కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శించారు. ఈ సందర్భంగా మొలచింతలపల్లి గ్రామంలోని భ్రమరాంబకాలనీలో సమస్యలపై చెంచులతో చర్చించి బాధిత మహిళ ఇంటికెళ్లి ఆమె ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆమె ఇంటికి వచ్చిన సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలను, పిల్లల చదువు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐదు లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ భూమి సాగు చేసేలా నీటి అవసరాలను తీర్చేలా చూడాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూత్రశాలలు మరుగుదొడ్ల కాంపౌండ్‌వాల్ పనులను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా 9వ తరగతిలో వచ్చిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారిగా క్లాసులు జరుగుతున్నాయని అడిగారు. మంచిగా చదివి ఉన్నతంగా రాణించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం భోజనకార్మికులతో మాట్లాడారు. రుచికరంగా భోజనాన్ని విద్యార్థులకుఅందజేయాలని వారంలో మూడు గుడ్లను తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనంతరం మొలచింతలపల్లి గ్రామంలో కొత్త రేషన్‌కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే అందజేస్తామని గ్రామస్థులకు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఆసరా పింఛన్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సూచించారు. పోడు భూములు ఎవరైతే సాగు చేసుకుంటున్నారో వారికి న్యాయం చేస్తానన్నారు. కొత్తగా అడవిలో చెట్లు నరికి సాగు చేసేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు, సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్పుద్దీన్, కొల్లాపూర్ తహసీల్దార్ శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాలను కూల్చేయిస్తున్న కమిషనర్

అచ్చంపేట టౌన్, జూలై 3: అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ శ్యాంసుందర్ అన్నారు. అచ్చంపేట వెంకటేశ్వర కాలనీలో అక్రమంగా రోడ్డు నిర్మాణాలు చేపట్టిన వాటిని బుధవారం ఎక్స్‌కవేటర్‌లతో కూల్చివేశారు. పట్టణంలోని పలు కాలనీలలో పర్యటించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు చేయాలనుకునేవారు మునిసిపల్ నిబంధనలకు లోబడి చేపట్టాలన్నారు. ఎవరైనా అక్రమనిర్మాణాలు చేసినట్టు తమ దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొడవ పడొద్దన్నందుకు కొడవలితో దాడి

రాజోలి, జూలై 3 : గొడవ పడొద్దు బాబాయ్ అంటూ సర్ది చెప్పేందుకు యత్నించిన సోదరుడి కొడుకుపై కొడవలితో దాడి చేశాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఉప్పరి తిమ్మప్పకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తిమ్మప్ప తరచూ భార్యను అనుమానిస్తూ, కొడుతుండటంతో చిన్న కుమార్తె మహేశ్వరి తన పెదనాన్న కుమారుడైన ఉప్పరి మోహన్‌కు మంగళవారం ఉదయం ఫోన్ చేసి చెప్పింది. దీంతో అతడు అదే గ్రామానికి చెందిన నజీర్ అనే వ్యక్తితో కలిసి తిమ్మప్ప ఇంటికి వచ్చాడు. భార్యాభర్తలిద్దరికీ నచ్చచెప్పేందుకు యత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో పెద్దమనుషుల వద్ద పంచాయితీ పెడతామని చెప్పి బయలుదేరారు. దీంతో ఆగ్రహించిన తిమ్మప్ప అతడిపై దాడి చేశాడు. ఇంట్లోనుంచి కొడవలి తెచ్చి నరికేందుకు యత్నించాడు. మోహన్ చేతిని అడ్డం పెట్టడంతో ఎడమ చేయికి తీవ్ర గాయమైంది. ఈ మేరకు ఉప్పరి మోహన్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అందుబాటులోలేని వైద్యులు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

మిడ్జిల్, జూలై 3 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం పదిన్నర తర్వాత కూడా వైద్యులులేక రోగులు ఇబ్బందులకు గురయ్యారు. అక్కడి నర్సులే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించారు. తమకు సరైన వైద్య సేవలు అందడంలేదని పలు గ్రామాల నుంచి వైద్య సేవల కోసం వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● కాస్త ఆలస్యమైంది : ప్రతీనిత్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులతో పాటు సిబ్బంది సమయానికి హాజరవుతారని, బుధవారం కాస్త ఆలస్యమైందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ శివకాంత్ తెలిపారు. ఇకపై అలా జరగకుండా చూసుకుంటామని డాక్టర్ తెలిపారు.

6న అచ్చంపేట మునిసిపల్ ఛైర్మన్ ఎన్నిక

అచ్చంపేట, జూలై 3: గత నెల 12న అచ్చంపేట మునిసిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఛైర్మన్ నర్సింహగౌడ్ పదవి కోల్పోయారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఈనెల 6న ఉదయం 11గంటలకు మునిసిపల్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ మంగళవారం సర్కులర్ జారీచేసింది. అచ్చంపేట మునిసిపాలిటీలో మొత్తం 20మంది వార్డు కౌన్సిలర్లుండగా అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్ పార్టీకి అనుకులంగా 16మంది కౌన్సిలర్లు ఓటింగ్‌లో అనుకులంగా పాల్గొనగా ఎమ్మెల్యే ఓటుతో 17కు చేరింది. మిగిలిన నలుగురు అవిశ్వానికి గైర్హాజరైన విషయం పాఠకులకు విదితమే. ప్రస్తుతం 14వ వార్డుకు చెందిన కౌన్సిలర్ గార్లపాటి శ్రీనివాసులు మునిసిపల్ ఛైర్మన్ రేసులో ముందున్నారు. ఆదేబాటలో ఒక బీసీని నియమించాల్సి వస్తే 1వ వార్డు కౌన్సిలర్ గౌరీశంకర్ ఉన్నారు. అదే విధంగా 10వ వార్డు కౌన్సిలర్ కుప్పిరెడ్డి సునిత కూడా మునిసిపల్ ఛైర్మన్ రేసులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏదిఏమైనా మునిసిపల్ పీఠం కాంగ్రెస్ ఖాతాలో పడనుంది.

ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తాం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, జూలై 3 : డ్రోన్ పైలెట్ శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార యూఏవీ సహకారంతో 13 రోజులుగా శిక్షణ డ్రోన్, డ్రోన్ డేటా ప్రాసెసింగ్ జీఐఎస్ మ్యాపింగ్, డీజీపీఎస్‌ల కోర్సుల శిక్షణ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ఎంపిక చేసిన 20 మంది మహిళలకు మంత్రి లైసెన్సు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రత్నగిరి ఫౌండేషన్ అడ్వయిజర్ జిల్లెల సతీష్, తార యూఏవీ మేనేజింగ్ ఆపరేషన్స్ డ్రోన్ ట్రైనర్ డాక్టర్ విజయ్‌కుమార్, డ్రోన్‌ట్రైనర్ శ్రీనాథ్, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 3: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి 2024 వరకు రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించడం శుభ సూచకమన్నారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన హామీ అమలు చేయకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో చాలా కాలంగా అధిక వడ్డీకి అప్పులు చేసి పంటలు సాగు చేశారని పేర్కొన్నారు. సీజన్ ప్రారంభమై నెల రోజులు కావడంతో బ్యాంకర్లు కూడా సకాలంలో రుణాలు ఇవ్వడం లేదని, దీంతో అప్పులు చేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సి.బాల్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.డీ.మాలిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో రైతుల భాగస్వామ్యం అవసరం

పెద్దకొత్తపల్లి, జూలై 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో రైతుల భాగస్వామ్యం అవసరమని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. బుధవారం పెద్దకొత్తపల్లిలోని రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా మహాజన సభ నిర్వహించారు. అనంతరం రైతుభరోసా రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రైతులు ఇచ్చిన సూచనల మేరకు ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ఇస్తుందన్నారు. జడ్పీటీసీ మేకల గౌరమ్మ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వైస్ చైర్మన్ మెరుగురాజు, డీసీవో రఘునాథ్‌రావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్, ఏవో శ్రీరామ్, సీఈవో సిరాజ్, మాజీ సర్పంచ్ వి.సత్యం, ఎంపీటీసీ రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య, డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, దండు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వికలాంగుల హక్కుల వేదిక నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 3: ఎన్నికల సమయంలో దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు కోట్ల గౌతమ్ డిమాండ్ చేశారు. బుధవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కోట్ల గౌతమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు వికలాంగుల పింఛన్‌తో పాటు ఉచిత బస్సు సౌకర్యం, 2016 వికలాంగుల హక్కుల చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వికలాంగుల పెన్షన్ రూ.300 పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదని, కల్యాణలక్ష్మి ప్రోత్సాహకాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి వారి సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన కోరారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి బాలీశ్వర్, నాయకులు ఆంజనేయులు, వెంకటయ్య అలివేల, చంద్రయ్య, మహేష్, శ్రీకాంత్, ఆనంద్, బంగారయ్య తదితరులు పాల్గన్నారు.

బాలబాలికల వేధింపులపై షీటీం అవగాహన

తెలకపల్లి, జూలై 3 : మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ బుధవారం విద్యార్థులకు షీటీమ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ మాట్లాడుతూ పోక్సో చట్టాలపై సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం రుగుతుందని తెలిపారు. తెలకపల్లి ఎస్ఐ నరేష్, షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, వెంకటయ్య భరోసా సెంటర్ కో ఆర్డినేటర్ శ్రీలత, పద్మావతి స్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఊర్కొండ, జూలై 3: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు గణేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ చెన్నకిష్టన్నకు నిరుద్యోగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తున్నదని నిరుద్యోగుల సమస్యలపై దశల వారిగా ఉద్యమాలు చేపడుతామని జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలని వినతిపత్రం తెలియజేశారు. నాయకులు రాజేందర్ గౌడ్, బ్రహ్మచారి, కొమ్మ శ్రీను, సందీప్, మల్లేష్, రాము, మహేష్, విజేందర్, రాజు తదితరులు ఉన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి డెమో, ఇంటర్వ్యూ

కొల్లాపూర్, జూలై 3 : కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అప్లై చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 4న ఉదయం 9:30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమోలు, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇటికల రామరాజు యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు పోస్టులకు త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందని, పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులు లేని పక్షంలో పీజీ అభ్యర్థులకు పర్సంటేజ్ బోధన అనుభవం ఆధారంగా ఎంపిక చేయబడునని కనుక అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

తెలకపల్లి, జూలై 3 : తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సందర్శించి రికార్డులు, క్రైమ్ ఫైల్స్ పరిశీలించి తగు సూచనలు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత పాటించాల ని ఎస్ఐ నరేష్, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఎస్పీతో పాటు నాగర్‌క ర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్యగౌడ్ సందర్శించారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

కల్వకుర్తి, జూలై 3 : సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో సైబర్ జాగృతి దివాస్‌ను పురస్కరించుకుని సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, బ్యూరోకార్డు సిబ్బంది హాజరయ్యారు. కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు..

- తెలకపల్లి-కల్వకుర్తి రహదారి పూర్తయ్యేనా?


- ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు



కంకర పర్చి తారు వేయని రోడ్డు

తెలకపల్లి, జూలై 3 : కంకర పరిచి సంవత్సరాలు గడుస్తున్నా బీటీ వేయడం మరిచిపోయారు. ప్రయాణికులు మాత్రం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెలకపల్లి నుంచి గుందూరు వరకు వేస్తున్న రహదారి పనులు నిలిచిపోయాయి. దాంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెలకపల్లి నుంచి గుందూరు వరకు డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా కంకర పరిచి బీటీ వేయకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు అదుపు తప్పి కింద పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. మరి కొంతమంది ప్రయాణికులు కల్వకుర్తి నుంచి వచ్చే వారు తాడూరు, మంతటి మీదుగా తిరుగుతూ వస్తున్నారు. ప్రారంభంలో ఉన్న కాంట్రాక్టర్ ప్రభుత్వం అతను వెళ్లిపోయాడు. దాంతో రోడ్డు పనులు ఆగిపోయాయి. ఒక ప్రయాణికుడు మాట్లాడుతూ రోడ్డు బాగా లేకపోవడంతో మంతటి మీదుగా తెలకపల్లి మండల ప్రాంతాలకు రావాల్సిన వస్తుండడంతో దూర భారం, ఆర్థిక భారం పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో చిరు వ్యాపారి కల్వకుర్తి ప్రాంతాల నుంచి తెలకపల్లి మండల ప్రాంతాలల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉంటాడు. అతనికొచ్చే కొద్దిపాటి లాభాలు చుట్టూ తిరిగి రావాలంటే ఆర్థిక భారం భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాల్సి నవసరం ఎంతైనా ఉందని ప్రజలు అంటున్నారు. చాలా సంవత్సరాల నుంచి కల్వకుర్తి తెలకపల్లి మధ్యలో రోడ్డు విస్తరణకు ప్రయత్నాలు చేయడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మండల కేంద్రం నుంచి మరో మండల కేంద్రానికి డబుల్ రోడ్డు వేస్తారని ప్రజలు ఆశించారు. కానీ ఈ రోడ్డు మాత్రం ఇంతవరకు జరగలేదు.

● రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి



మధ్యలో ఆగిపోయిన కల్వకుర్తి తెలకపల్లి రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి. సంవత్సరం గడిచిపోయినా ఇంతవరకు రోడ్డు పనులు పూర్తి కాలేదు. దాంతోపాటు కంకరపర్చి మధ్యలోనే ఆపివేయడం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బైక్‌లపై వెళ్లేవారు అదుపు తప్పి కింద పడుతున్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

- ఉమాపతి, తెలకపల్లి

పదవులు శాశ్వతం కాదు.. ప్రజల ఆశీర్వాదం గొప్పది

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



ఎంపీపీ గుండె నిర్మల దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్

చారకొండ, జూలై 3: పదవులు శాశ్వతం కాదు ప్రజల ఆశీర్వాదం చాలా గొప్పదని అందరు కలసికట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకొందామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం గురువారం ముగియనుండడంతో బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ గుండె నిర్మల అధ్యక్షతన వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడారు. మండల కేంద్రంలో ఉన్న ప్రస్తుత రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించి సెంటర్‌లైట్ల ఏర్పాటుతో పాటు డివైడర్‌కు రూ. 16 కోట్లు, నూతన బ్రిడ్జికి రూ. 20 కోట్లతో నిర్మించే విధంగా ప్రపోజల్ పెట్టి 2 నెలల్లో మంజూరు చేయించి పూర్తిస్థాయిలో నిర్మించే విధంగా కృషి చేస్తానని అన్నారు. చారకొండ మండలం నూతనంగా ఏర్పడడంతో ప్రభుత్వ కార్యాలయాలకు 5 ఎకరాల ప్రభుత్వం భూమిని గుర్తించి అక్కడే అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. మండల కాంప్లెక్స్ భవనాలకు రూ. 29 కోట్లు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. మండలంలోని గోకారం పెద్ద చెరువును గత ప్రభుత్వం రిజర్వాయర్ పేరుతో తొలగించడంతో రైతులు, మత్స్య కారులు నష్టపోయారని గోకారం పెద్ద చెరువు గురించి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి 6 నెలల్లో పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకొంటామని అన్నారు. మండలంలోని శిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని రూ. 100 కోట్లతో అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఎంపీపీ గుండె నిర్మల, విజేందర్‌గౌడ్ దంపతులకు, వైస్ ఎంపీపీ నకినమోని బక్కమ్మ యాదవ్, ఎంపీటీసీలు గ్యార లక్ష్మణ్, లక్ష్మణ్‌నాయక్, లలితబాల్‌సింగ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు సలీంలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌లు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కేసీ ప్రమీల, ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, చారకొండ మాజీ సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అంజయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, సింగిల్‌ఇండో మాజీ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ భీముడు నాయక్, మాజీ ఎంపీటీసీ నర్సింహరెడ్డి, మాజీ సర్పంచులు, రంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, నరేష్‌నాయక్, ప్రశాంత్‌నాయక్, మహేష్, వసంత పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో వైద్య సేవలు

అచ్చంపేట అర్బన్: నల్లమలలోని మారుమూల ప్రాంతాల రోగులకు వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆయన బుధవారం అచ్చంపేట మండలంలోని చందాపూర్, ఐనోల్ గ్రామాల్లో పల్లె దవాఖానాలను ప్రాంభించారు. సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో సుధాకర్‌లాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. అలాగే, బొమ్మన్‌పల్లిలో మండల్ పరిషత్ పాఠశాలలో కిష్య తండాకు చెందిన ధర్మానాయక్‌తో కలిసి విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ తారాసింగ్, మలేరియా ఉపవైద్యాధికారి అశోక్‌కుమార్, సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, నాయకులు సీఎం రెడ్డి, మంత్రియానాయక్, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



పార్థివదేహాలను తరలించే వాహనం అందజేసి దానిపై కూడా పేరు పెట్టుకున్నారంటూ ఫొటో చూపిస్తున్న మర్రి

తాడూరు, జూలై 3 : ప్రస్తుతం నాగర్‌కర్నూల్ నియోజక వర్గంలో గెలిచిన ఎమ్మెల్యే ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాల భవనాలపై తమ ట్రస్టు పేర్లు కనబడకుండా పర్దాలు కప్పి ప్రారంభించడం తప్ప ఇచ్చిన హామీల అమలుపై ఎలాంటి దృష్టి సారించడం లేదంటూ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన భవనాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల గత కొన్ని రోజుల క్రితం ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాలలను కనీసం మాకు సమాచారమివ్వకుండా ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాలలకు బోర్డులు ఏర్పాటు చేస్తే వాటిపై పర్దాలను ఏర్పాటు చేసి ప్రారంభోత్సవాలను చేసినంత మాత్రాన ప్రజల గుండెల్లో నుంచి మర్రిని తొలగించలేరన్నారు. పోలీసులు సైతం ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ అధికార పార్టీకి కొమ్ముకాయడం వృత్తికే అవమానకరమన్నారు. ఎమ్మెల్సీలకు వచ్చిన ప్రభుత్వనిధులతో బెంచీలు, ఆయా గ్రామాల్లో బస్టాండ్‌లకు, తాడూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాగర్‌కర్నూల్‌లో పార్థివ దేహాలను తరలించే వాహనానికి పేర్లు పెట్టుకోవడం ఎంత వరకు సమంజసమని మీరే ఆలోచించాలన్నారు. ఆ మాదిరిగా ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులకు నేను ఒక్కపేరైనా పెట్టుకున్నట్లు చూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. మండల బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మశన్న, పర్వతాలు, కృష్ణయ్య, అనిల్‌రెడ్డి, బాలగౌడ్, రాజుగౌడ్, రమణ, సమద్‌పాషా, వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాగా స్థలాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ టౌన్: ఈ నెల 7 నుంచి జిల్లా కేంద్రంలోని ఓంనగర్‌కాలనీలో నిర్వహించనున్న ఆయుత చండీ అతిరుద్ర యాగ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బుధవారం సందర్శించారు. యాగ నిర్వాహకులు శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీని యాగ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాజీ ఎమ్మెల్యేకు యాగ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



తిమ్మాజిపేట: సన్మానం పొందిన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు

తిమ్మాజిపేట, జూలై 3 : ఐదేళ్ల పదవీకాలంలో అందరూ అందించిన సహకారంతో అభివృద్ధి పనులు చేశామని ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో లక్ష్మీదేవి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు రాజకీయ పార్టీలకు అతీతంగా అందించిన సహకారం చూపించిన అభిమానం ఎప్పుడు మరువలేరన్నారు. గతంలో సింగిల్ విండో ఉపాధ్యక్షుడిగా ప్రస్తుతం ఎంపీపీగా తనకు మంచి గుర్తింపునిచ్చిందన్నారు. అదేవిధంగా జడ్పీటీసీ దయాకర్‌రెడ్డి, పలువురు సభ్యులు, అధికారులు మాట్లాడారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులకు జడ్పీటీసీలకు పలు శాఖల అధికారులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీపీని అందరూ సన్మానించి అభినందనలు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మకల్‌కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్, ఎంఈవో శ్రీనివాసులు, ఎంపీవో బ్రహ్మచారి, విద్యుత్ ఏఈ సాయన్నగౌడ్, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు సన్మాన సభ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఉమామహేశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు చిట్టెమ్మ, స్థానిక ఎంపీటీసీ సభ్యులను పదవి కాలం ముగింపు సందర్భంగా ఎంపీడీవో ప్రసన్నకుమారి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై సభలో చర్చించారు. ఎంపీటీసీ సభ్యులు సుమలత, ఈశ్వరీకుమారి, జిల్లా కో ఆప్షన్ మతిన్ అహ్మద్, మండల కో ఆప్షన్ అబ్దుల్ హుసేన్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీవో భరత్, పంచాయతీకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మనోహర అధ్యక్షతన జరిగిన చివరి సమావేశం కావడంతో ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీ గోవర్ధన్, ఎంపీటీసీ సభ్యులకు పూల మాలలు, శాలువాలతో అధికారులు సత్కరించారు. వీడ్కోలు పలికారు. ఎంపీడీవో వెంకట్రాములు మాట్లాడారు. తహసీల్దార్ ఇబ్రహీం, నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా లయన్స్‌క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్రకుమార్

కందనూలు, జూలై 3 : నాగర్‌కర్నూల్ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రమాణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్రకుమార్ హాజరై క్లబ్ 34వ అధ్యక్షుడిగా దొడ్ల రాధారెడ్డి, కార్యవర్గానికి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సమాజంలో ఉన్న నిరుపేదలకు సహాయం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న అవసరాలు గుర్తించి మన అవకాశం మేరకు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడడం, గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం, ఇంకా ఏమైనా ఇతర అవసరాలు గుర్తించి మన వీలు మేరకు సాయం చేయడం చేయాలని కోరారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా దొడ్ల రాధారెడ్డి, కార్యదర్శిగా వాస లక్ష్మీ, కోశాధికారిగా సూరంపల్లి నాగరాణి, మిగతా కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దొడ్ల రాధారెడ్డి మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సభ్యులందరు సహకారం అందించాలని కోరారు. మాజీ గవర్నర్ రాధాకృష్ణ, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, జోన్ చైర్మన్ శివ్వ శ్రీనివాస్, రీజియన్ సెక్రటరీ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, క్లబ్ మాజీ అధ్యక్షుడు హకీం విశ్వప్రసాద్, దొడ్ల రాజావర్ధన్‌రెడ్డి, క్లబ్ మొదటి మహిళ అధ్యక్షురాలు దొడ్ల ఇందుమతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు దిలీప్, సుధాకర్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు దొడ్ల నారాయణరెడ్డితో పాటు క్లబ్ మాజీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై గట్టి నిఘా

- కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నిర్మూలనకై సమిష్టిగా కృషి చేద్దామని అన్ని శాఖల కృషి తోనే మత్తు పదార్థాలను జిల్లాలో సమూలంగా నిర్మూలించగలమని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి మాదక ద్రవ్య నిరోధక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్, విద్యాశాఖ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, డీఎంహెచ్‌వో, అగ్రికల్చరల్, పోలీస్ వివిధ శాఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ, రవాణాపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి ఉత్పత్తి రవాణా వినియోగంపై కమిటీ సమావేశ అధికారులు పటిష్ట నిఘా పెట్టి నాగర్‌కర్నూల్ జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడీ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే.సుధాకర్‌లాల్, జిల్లా ఎక్సైజ్ అధికారిని, ఇతర పోలీస్, విద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బిజినేపల్లి, జూలై 3 : పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాల వయస్సు పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ప్రాణాంతక వ్యాధి నిరోధక టీకాలు వేయడంలో వైద్యశాఖ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ జిల్లా టీకాల అధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్ హెచ్చరించారు. మండలంలోని మంగనూర్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి టీకాల పంపిణీపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించి మాట్లాడారు. ముందుగానే గుర్తించిన చిన్నారులకు అవసరమైన టీకాలను మొదటి స్టేజ్‌లోనే ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, పర్యవేక్షకులు కేశవులు, ఆరోగ్య కార్యకర్తలు తాళ్ల యాదగిరి, పద్మ, జ్యోతి, అంగన్వాడీ కార్యకర్త సుగుణ, ఆశలు ఉన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొత్తపల్లి, జూలై 3 : సైబర్‌నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ అన్నారు. బుధవారం పెద్దకొత్తపల్లిలోని పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియాలో స్నేహం చేయరాదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పకూడదని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్, కానిస్టేబుల్ ఆంజనేయులు, సరిత, రేణుక ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 3: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు 2024 ఎంపిక కోసం ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని కేంద్రీయ, జవహర్ నవోదయ, సైనిక్ స్కూల్, అటమిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ, ఏకలవ్య, మోడల్, ఆశ్రమ, సెంట్రల్ బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్ చేత అఫిలయేషన్ పొందిన విద్యా సంస్థలు, ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ పొందిన పాఠశాలల ఉపాధ్యాయులు ఈ అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు నేషనల్ టీచర్స్ అవార్డు వెబ్‌సైట్‌ను సందర్శించి నిర్దేశించిన తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

'బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి'

కల్వకుర్తిటౌన్, జూలై 3 : తిరుపతి హైవే వెళ్లే మార్గంలో కుర్మిద్ద గ్రామానికి రహదారి సమీపంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కుర్మిద్ద, కుర్మిద్దతండాకు చెందిన ప్రజలు కోరారు. బుధవారం హైవే నిర్మాణం చేపడుతున్న అధికారులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆనంద్‌కుమార్‌తో కలిసి వెళ్లి వినతిపత్రం అందజేశారు. రహదారి నిర్మాణానికి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవి, దామోదర్‌గౌడు, శేఖర్, సుభానీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే జొన్న పంటలో అధిక దిగుబడులు

మన్ననూర్, జూలై 3: సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా జొన్న పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ విస్తరణాధికారి సీతారాం నాయక్ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా జొన్న చేలను పరిశీలించగా, జొన్న చేలకు కత్తెర తెగులు ఉన్నట్లుగా గుర్తించారు. ఇట్టి పురుగు నివారణకు స్పైనోసాడ్0.3గ్రాములు లీటర్ నీటిలో కలిపి ఉదయం, సాయంత్ర వేళల్లో పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతు సంఘం నాయకులు సామ్య, జయేందర్, బుజ్జి పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 3: నీట్ పేపర్ లీకేజీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్‌టీఏను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం దేశ వ్యాప్తంగా ఇచ్చిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తారాసింగ్ మాట్లాడుతూ నీట్ ఎన్‌టీఏను రద్దు చేయడంతో పాటు యూజీసీ కంబైన్డ్ నెట్ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, నీట్ పరీక్షకు కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, లక్ష్మణ్, రాజేష్, అంజి, శివ, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల బరువు, ఎత్తుల పరిశీలన

పెద్దకొత్తపల్లి, జూలై 3 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పిల్లల బరువులు, ఎత్తులను కొల్లాపూర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగమ్మ పరిశీలించారు. దేవునితిర్మలాపూర్ గ్రామంలో 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-5సంవత్సరాల పిల్లల బరువులు, ఎత్తులను తీశారు. ప్రతీ నెల పిల్లల బరువులు, ఎత్తులను తీసి పిల్లల తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సులోచన, వరమ్మ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఆవు మృతి

- రూ. 80వేల ఆస్తి నష్టం

పెద్దకొత్తపల్లి, జూలై 3 : మండల పరిధిలోని సంజీవ్‌పూర్ గ్రామానికి చెందిన వేనేపల్లి ప్రశాంత్‌రావుకు చెందిన ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. వేనేపల్లి ప్రశాంత్‌రావుకు తమ ఆవులను తమ వ్యవసాయ పొలంలో మేపుకురావడానికి తీసుకెళ్లాడు. వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ప్రమాదవశాత్తున విద్యుత్ వైర్ తగిలి ఆవు మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ సుమారు 80వేల విలువ ఉంటుందని బాధితుడు తెలిపారు.